# అశ్వమేధ యాగం

"అమ్మకి ప్రాణంమీద కొచ్చింది. వెంటనే బయల్దేరు—రామం."

తమ్ముడిచ్చిన టెలిగ్రాం చదువుకున్నాడు వెంకటేశ్వర్లు. ఒక్కక్షణం మట్టుకు మనసులోని ఊహలన్నీ స్తంభించి మెదడు శూన్యమయింది. కత్తివేటుకి చర్మం తెగితే వెంటనే రక్తం రాదు. రక్తంరావడం ప్రారంభించడంతో వరదగా ప్రవహిస్తుంది.

ఊహలు వరదలుగా ప్రవహిస్తున్నాయి. "..........అమ్మ చచ్చిపోతుంది కాబోలు. సాయంత్రం మెయిలులో బయల్దేరాలి. వెళ్ళేదాకా ఉంటుందో ఉండదో; రేపు వెళ్ళితే? ముసలి ప్రాణం రేపటిదాకా నిలుస్తుందా? అయినా ఇవాళ బయల్దేరడానికి వీలు లేదు. రేపు వెళ్ళవచ్చు. చచ్చిపోదు. ఫరవాలేదు. రేపే వెళతాను. మరి డబ్బు?"

తలకాయలో పందెపు గుర్రాలు పరుగెత్తుతున్నాయి.

డబ్బు సంగతి తలలో మెరిసిన వెంటనే "ఈ టెలిగ్రాముతోనే డబ్బు పోగు చెయ్యవచ్చు" ననే ఊహ పుట్టింది. ఒక చోట కాదు. పదిచోట్ల సొమ్ము చెయ్యవచ్చు. తల్లి చచ్చిపోతోందంటే డబ్బు బదులివ్వని కఠిన హృదయులుండరు. నలుగురైదుగురు బిర్రబిగిసినా, ఐదారుగురైనా ఇచ్చి తీరుతారు. సుమారు నూరు రూపాయలు పడతాయనడానికి సందేహం లేదు.

వెంటనే బట్టలు వేసుకున్నాడు. దమ్మిడీ అయినా లేదు. దగ్గరలో ఉన్నవాడూ, అడగ్గానే అప్పు యిచ్చేవాడూ ఎవరని ఆలోచించాడు. మరెవరు? సత్యనారాయణ ఉన్నాడు. నాలుగు వీధుల అవతల. నడుచుకుపోవచ్చును. ఈ కష్టసమయంలో పెళ్లాం మెళ్ళో నగ తాకట్టుపెట్టి అయినా డబ్బు తెమ్మని అడగదగినంత చనువూ, అవకాశం ఉన్నాయి.

"సత్యనారాయణ గారూ!"

"ఇంట్లో లేరండీ!"

ఏం అపశకునం! ఇంత పెందరాళే ఎక్కడికి వెళ్ళిపోయాడో? అన్నట్టు టెలిగ్రాము గదిలో వదిలిపెట్టలేదు కద. జేబు తడుముకున్నాడు. ఉంది. జేబులోనే ఉంది.

మరి ఈ సత్యనారాయణ ఎక్కడ దొరుకుతాడు? కాఫీ క్లబ్బులోనా? తన జేబులో రెండణాలయినా ఉంటే బాగుండును. అప్పే కాఫీ క్లబ్బుకి వెళ్ళడు. "ఇంట్లో కనుక్కుందాం. చెప్పి వెళతాడా? ఏమో....అడిగి చూదాం."

"సెంట్రలుస్టేషను కెళ్ళారండి. వచ్చాక మీ రొచ్చినట్టు చెబుతాను." ఇంట్లో నుండి జవాబు. వీధికొసని తనకి తెలిసిన సోడా దుకాణం నాయర్ దగ్గర ఒకపావలా తీసుకున్నాడు వెంకటేశ్వర్లు. బస్సులో పడ్డాడు. నిలబడే ప్రయాణం చేశాడు. గుర్రాలు మరీ జోరుగా పరుగెడుతున్నాయి మనస్సులో.

ప్లాటుఫారం మీద సత్యనారాయణని కలుసుకున్నాడు. ఇంకా మెయిలు రాలేదు. "మా బావమరిది వొస్తున్నా" డని సత్యనారాయణ ప్రకటించాడు. ఎలా ప్రారంభిస్తే బాగుంటుంది? "మీ యింటికి వెళ్ళితే నువ్వులేవు. అర్జంటు పని మీద వొచ్చాను." అంటే? బడి కుర్రాడు పెన్సలుగీతలు రబ్బరు పెట్టి తుడిచివేసినట్లు మనస్సులోంచి ఈ మాటలను తుడిచివేశాడు. ఏమీ అనకుండా జేబులోంచి వైరు తీసి సత్యనారాయణ కిచ్చాడు.

"అరే, పాపం! మీ అమ్మకి జబ్బుగా ఉన్నట్లు కూడా వినలేదే!"

"వృద్ధాప్యమే జబ్బు. బతకదు. లాభం లేదు. సాయంత్రం మెయిలుకి పోదా మనుకుంటున్నాను."సత్యనారాయణ చూపులు శూన్యాన్ని చిన్నచిన్న పీలికలుగా తుంచు తున్నాయి. "వెడదామంటే డబ్బులేదు........" ఎవ్వరో నూతిలోపడిపోయినట్టు ఈ మాటలన్నాడు వెంకటేశ్వర్లు తొందరగా.

సత్యనారాయణ కుడిచేతి బొటనవ్రేలినీ, చూపుడు వ్రేలినీ చాచి నుదుటిని పట్టుకొని "పాతికరూపాయలేనా ఉండాలనుకుంటాను" అన్నాడు.

"ముప్పై రూపాయలు కావాలి. నువ్వే ఇవ్వాలి. ఎంత ముంచుకొచ్చినా ఎవరినీ నోరు విడిచి అడగలేను."

సత్యనారాయణది త్వరగా కరిగిపోయే గుండె. నగ తాకట్టుపెట్టి ఇస్తాననిపించ డానికి వెంకటేశ్వర్లుకి ఐదు నిమిషాలకంటె ఎక్కువ పట్టలేదు. మధ్యాహ్నం రెండు గంటలకి మీ ఆఫీసులో కలుసుకుని సొమ్ము తీసుకుంటానని చెప్పి వెళ్ళిపోయాడు వెంకటేశ్వర్లు.

*　　　*　　　*

నరహరి సెట్టి దగ్గర పది రూపాయలు సంపాదించేసరికి తలప్రాణం తోకకు వచ్చింది.

*　　　*　　　*

టాక్సీ చేయించుకొని మైలాపూరు బ్యాంకుకి వెళ్ళాడు వెంకటేశ్వర్లు. బ్యాంకు గుమాస్తా కామేశం స్నేహితుడు కాడుగాని పరిచయస్థుడు. ఇలాంటి సన్నివేశాలలో స్నేహంకన్న పరిచయమే డబ్బు పలికిస్తుంది.

బ్యాంకులో అరగంట వ్యర్థమైపోయింది. దమ్మిడీ కూడా పెగలలేదు. టాక్సీని పంపించివేశాడు. అనవసరంగా డబ్బు వేటకి ఎక్కువ పెట్టుబడి పెట్టకూడదని నిశ్చయించాడు.

ఇద్దరు ముగ్గురు వకీలు స్నేహితుల ఇండ్లకు నడుచుకుంటూ వెళ్ళాడు. టెలిగ్రామ్ చూపించి ఒకచోట ఇరవై, ఇంకొకచోట ఇరవై ఐదూ పిండుకున్నాడు.

*　　　*　　　*

మధ్యాహ్నం పండ్రెండు గంటలకి జేబులో డెబ్భయిఅయిదు రూపాయల జమ.

గుర్రాలు జోరుజోరుగా పరుగెత్తుతున్నాయి. సత్యనారాయణ ఇచ్చే ముప్ఫయి రూపాయలూ కలుపుకొని నూటఐదు రూపాయలవుతాయి. ఇవాళ గిండీకి వెళ్ళిపోతాను. గుర్రపు పందాల ఆఖరిరోజు. చీకటితోనే ఎక్స్ప్రెస్ ఎక్కేస్తాను.

"రెండు మూడు వందలేనా గెలవకపోతానా" అనుకున్నాడు వెంకటేశ్వర్లు. నిన్న సాయంత్రం కొన్న "రేసింగ్ గైడు" కోటు లోపలి జేబులోంచి పైకి తీశాడు. సైంటిఫిక్‌గా ఆలోచించి గుర్తులుపెట్టుకున్న గుర్రాలపేర్లు మరోమారు మననం చేసుకున్నాడు. ఇవాళ నువ్వు గెలిచి తీరుతావని ఎవరో రక్తంలోంచి సందేశాలు పంపుతున్నట్లనిపించింది.

"మరి ఇంటికి వెళ్ళను. భోంచెయ్యాలని లేదు. టిఫిన్ తీసుకొని సత్యనారాయణ ఆఫీసుకీ, అక్కణ్ణుంచే పార్కు స్టేషనుకీ."

ఎలక్ట్రిక్ ట్రెయిన్‌లో కూర్చున్నాడు. ట్రెబిల్ ఈవెంట్‌లో ఏడెనిమిది వంద లొస్తే ఇవాళ చేసిన అప్పులన్నీ ఈ సాయంత్రమే తీర్చేస్తాను. కిందటి రేస్‌లో ఈ నెల జీతమంతా తగలేశాను. అనుకున్న గుర్రాలని ఆడకుండా ఎవరో చెప్పిన మాట వింటే ఏమవుతుంది మరి?

"ఇవాళ ఫరవాలేదు. కళ్ళు మూసుకొని ఆడేస్తాను. పుట్టమీద పెట్టినట్టు డబ్బొచ్చేస్తుంది. ఫూల్‌ప్రూఫ్‌గా ఆలోచించాను. సైంటిఫిక్‌గా అంచనా వేశాను. ఇవాళ నేను ఓడిపోవడానికి వీలు లేదు."

*　　　*　　　*

వెంకటేశ్వర్లు సాయంత్రం గిండీనించి మరలి వస్తున్నప్పుడు అతని జేబులో తొమ్మిదణాల చిల్లర డబ్బులు, రెండు సిగరెట్లున్న విల్సు పాకెట్టు, ఉదయం అందిన టెలిగ్రామూ మాత్రం మిగిలాయి. అతనెంత సైంటిఫిక్‌గా ఆలోచించ గలిగినవాడైనా గుర్రాలకి ఆ సబబు లేవీ తెలియకపోవడమే అతని పరాజయానికి కారణం.

ముద్రణ: కథావీధి 1945 ? ('వారం వారం'లో చేరింది.)